సాక్షి నంద్యాల

బుధవారం ; 24 ; జనవరి ; 2024



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయప్రాంగణంలోని శనగల బసవన్నకు, బయలు వీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు.



ఘనంగా గ్యారతారిఖ్ వేడుకలు

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో మంగళవారం గ్యారతారిఖ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఫాతెహాలు సమర్పించారు.



విధుల్లోకి అంగన్‌వాడీలు

సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అంగన్‌వాడీలు సమ్మె విరమించి మంగళవారం విధుల్లో చేరారు.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

నంద్యాలటౌన్: ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన సేవలు అందించేందుకు బుధవారం 'డయల్ యువర్ ఆర్‌ఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 9959224885కు ఫోన్ చేసి ప్రయాణికులు సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని సూచించారు.

ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ

నంద్యాల: ఎన్నికల నిర్వహణ సమర్థతపై మాస్టర్ ట్రైనర్లు సంపూర్ణ శిక్షణ పొంది ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులకు శిక్షణ నివ్వాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో పోలింగ్ ప్రక్రియ ఈవీఎంల పనితీరు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఐటీ సంబంధిత అంశాలపై జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు (డీఎల్‌ఎంటీ) అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ల (ఏఎల్‌ఎంటీ) శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోల్ డే ఏర్పాట్లపై నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణపై ఆత్మకూరులో ఆర్డీఓ ఎం.దాసు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు, ఐటీ సంబంధిత అంశాలపై డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి తదితరులు మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు.

విద్యుత్ టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

నంద్యాల(అర్బన్): నంద్యాల విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయ ఆవరణలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏపీఎస్పీడీసీఎల్ ప్రతిపాదించిన వార్షిక ఆదాయవనరులు, రిటైల్ ధరలు తదితర వాటిపై ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఈ రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ పట్టణం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయ సేకరణ జరుగుతుందని కార్యక్రమానికి వస్తున్న వినియోగదారులు ఆన్‌లైన్, కార్యాలయ పని దినాల్లో సంబంధిత సమస్యపై రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆ మూడు రోజుల్లో ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహించే అభిప్రాయ సేకరణ సమయంలోనూ, రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. విద్యుత్ సంస్థ చేపడుతున్న ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకవాలన్నారు.

ఏహెచ్‌ఏ పోస్టులకు ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధకశాఖలో ఏహెచ్‌ఏ పోస్టుల భర్తీకి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ మంగళవారం సాయంత్రానికి ముగిసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 252 ఏహెచ్‌ఏ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా 233 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లభించారు. ఎస్టీ ఉమన్, ఎక్స్ సర్వీస్‌మెన్, అంధులకు రిజర్వు చేసిన 19 పోస్టులకు అభ్యర్థులు కరువయ్యారు. సోమవారం 117, మంగళవారం 116 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. డివిజినల్ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ దుర్గాప్రసన్నబాబు, పి.వెంకటరమణ, పివి.రమణమూర్తి, డీవీ రమణయ్య నేతృత్వంలోని టీమ్‌లు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రామచంద్రయ్య ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 24, 25 తేదీల్లో నియామక పత్రాలు జారీ చేయనున్నారు.

'పండంటి' సాగు!



ప్యాపిలి మండలంలో అభివృద్ధి చెందిన చీని తోట

రూ.1.20 లక్షల ఆదాయం



2019–20లో రెండు ఎకరాల్లో ఉపాధి నిధులతో చీని తోటను అభివృద్ధి చేసుకున్నా. మూడేళ్లుగా పంట తీస్తున్నా. ఏడాదికి సగటున రూ.1.20 లక్షల నికరాదాయం వస్తోంది. అంతకు ముందు వేరుశనగ సాగు చేస్తుంటి. రెండు ఎకరాలకు కలిసి ఏడాదికి రూ.30 వేల వరకు ఆదాయం వచ్చేది. పండ్లతోట అభివృద్ధితో రూ.లక్ష ఆదాయం పెరిగింది. – బి.మోహన్‌రెడ్డి, గుమ్మకొండ గ్రామం, డోన్ మండలం

పండ్లతోటల సాగు కలిసొచ్చింది



2020–21లో 3.13 ఎకరాల్లో చీని సాగు చేశాం. రెండేళ్లుగా దిగుబడి వస్తోంది. సగటున ఏడాదికి రూ.3.40 లక్షల నికరాదాయం పొందుతున్నా. గతంలో మిర్చి, టమాట పంటలు సాగు చేస్తే ఏడాదికి రూ.80 వేల వరకు మాత్రమే ఆదాయం వచ్చేది. ఏం చేయాలో తెలియక వలసపోయేటోళ్లం. తోట పెట్టుకున్నాక సంతోషంగా ఉన్నాం. – కౌలుట్లమ్మ, పి.కోటకొండ గ్రామం, దేవనకొండ మండలం



పూతపట్టిన మామిడి చెట్లు

ఐదేళ్లలో 19,249 ఎకరాల్లో పండ్లతోటలు

- 10,377 మంది ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు స్థిరాస్తి
- 2024–25 సంవత్సరంలో పండ్ల తోటలకు మరింత ప్రాధాన్యం
- ఉమ్మడి జిల్లాలో 16,200 ఎకరాల్లో సాగు లక్ష్యం
- 100 శాతం సబ్సిడీతో పాటు నిర్వహణకు నిధులు

కర్నూలు(అగ్రికల్చర్): కరువు ప్రాంతాల్లో పండ్ల తోటల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 100 శాతం సబ్సిడీతో పండ్లతోటల అభివృద్ధికి అవకాశం కల్పిస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు చిన్న, సన్నకారు రైతుల స్థిరాస్తిని అభివృద్ధి చేసే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. 2019–20 నుంచి ఈ కార్యక్రమం మొదలు కాగా.. ఈ ఐదేళ్లలో 19,249 ఎకరాల్లో పండ్లతోటలు కళకళలాడుతున్నాయి. ఫలితంగా పశ్చిమ ప్రాంతం నుంచి వలసలు గణనీయంగా తగ్గాయి. 2023–24లో కరువు ఏర్పడినప్పటికీ టీడీపీ హయాంతో పోలిస్తే వలసలు 25 శాతం వరకు కూడా లేవని స్పష్టమవుతోంది. 2024–25వ సంవత్సరానికి ఉపాధి నిధులతో పండ్లతోటల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. ఐదు ఎకరాల్లోపు ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు సన్న, చిన్నకారు రైతులను అర్హులుగా ప్రకటించింది. ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి భూమికి పట్టాదారు పాసుపుస్తకం ఉంటే పండ్ల తోటల సాగుకు 100 శాతం సబ్సిడీ లభిస్తుంది. అయితే రైతులు ఇంతకు ముందు సంవత్సరాల్లో ఉపాధి హామీ లేదా ఉద్యానశాఖ, ఇతర ఏ శాఖల నుంచి లబ్ధి పొంది ఉండరాదనే నిబంధన ఉంది.

సమృద్ధిగా నీటి వనరులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2024–25 సంవత్సరానికి కర్నూలు జిల్లాలో 6,200 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 10,000 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. ఇప్పటికే పండ్లతోటల అభివృద్ధిపై ఆసక్తి ఉన్న రైతులను గుర్తించే కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. జిల్లాలో వివిధ మండలాల మీదుగా హంద్రీనీవా కాలువ పారుతోంది. ఏడాదిలో 9 నెలలు ఈ కాలువలో నీరు ఉంటుంది. అలా గే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు నియోజక వర్గాల్లో 77 చెరువులను ప్రభుత్వం కృష్ణా జలాలతో నింపింది. వీటి కింద పండ్లతోటల అభివృద్ధికి అవకాశం ఉంది.

17 రకాల తోటల అభివృద్ధి

100 శాతం సబ్సిడీతో గులాబి, మల్లెతో సహా 17 రకాల(మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, ఆపిల్ బేర్(రేగు), డ్రాగన్‌ఫ్రూట్స్, అంజూర, మునగ తదితర) పండ్లతోటల అభివృద్ధికి అవకాశం ఉంది. మునగ, మల్లె, గులాబి, ఆపిల్‌బేర్ పండ్లతోటలకు నిర్వహణ బిల్లులు రెండేళ్లు.. మిగిలిన పంటలకు మూడేళ్ల పాటు చెల్లిస్తారు.

డ్రైల్యాండ్ హార్టికల్చర్‌కు అవకాశం

గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా పండ్లతోటల అభివృద్ధికి నీటి వసతి కచ్చితంగా ఉండాలనే నిబంధన లేదు. మెట్టభూములు, చౌడు భూముల్లో కూడా పండ్లతోటలు అభివృద్ధి చేసుకోవచ్చు. తమ పొలం పరిసరాల్లో చెరువు, లేదా కాలువ, డగౌటు పాండ్, ఇతర నీటి సదుపాయం ఉన్నా పండ్లతోటల సాగుకు అనుకూలం. మొక్కలను బతికించుకునేందుకు ప్రభుత్వం ఉపాధి కింద నీటి బిల్లులు కూడా చెల్లిస్తోంది. దీనినే డ్రైల్యాండ్ హార్టికల్చర్‌గా వ్యవహరిస్తారు. ఈవిధంగా మామిడి, నేరేడు, సీతాఫలం, చింత, రేగు(ఆపిల్‌బేర్), జామ, మునగ వంటి తోటలను అభివృద్ధి చేసుకోవచ్చు. ఉపాధి కింద చౌడు నేలల్లోనూ సీతాఫలం, నేరేడు, జామ, సపోట వంటి మొక్కలు నాటుకోవచ్చు. అయితే సమీపంలో నీరు తప్పనిసరి. మిగిలిన తోటల అభివృద్ధికి బావి లేదా బోరు ఉండాలి.

పండ్ల తోటల అభివృద్ధికి ప్రోత్సాహం



అసైన్డ్ భూములు, మెట్టభూములు కలిగిన రైతులు పండ్ల తోటలను సాగు చేసుకునేందుకు ప్రభుత్వం చక్కటి అవకాశం కల్పిస్తోంది. అయితే మొక్కలను కాపాడుకునేందుకు నీటి సదుపాయం తప్పనిసరి. జిల్లాలో కరువు పరిస్థితులు ఉన్నందున పండ్లతోటల అభివృద్ధిని పోత్సహిస్తున్నాం. కర్నూలు జిల్లాలో ఈ ఏడాది 10 వేల ఎకరాల్లో తోటలను అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. రైతులు సంబంధిత ఎంపీడీఓలు, ఏపీఓలను లేదా 9121103297 నెంబర్‌ను సంప్రదించవచ్చు.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కర్నూలు

ఐదేళ్లలో 19,249 ఎకరాల్లో పండ్లతోటలు

- 2019–20 నుంచి 2023–24 వరకు ప్రభుత్వం పండ్లతోటల అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రాధాన్యం కల్పించింది.
- 2014–15 నుంచి 2018–19 వరకు టీడీపీ ఐదేళ్ల పాలనలో పండ్లతోటల అభివృద్ధి నామమాత్రమే.
- ఆ సమయంలో చెక్‌డ్యాంల పేరిట నిధులను టీడీపీ కార్యకర్తలకు దోచిపెట్టారు.
- 20–23 శాతం నిధులు ఖర్చు చేసి మిగిలిన డబ్బంతా 'తమ్ముళ్ల' జేబుల్లోకి చేరింది.
- వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 19,249 ఎకరాల్లో పండ్లతోటలను అభివృద్ధి చేసింది.
- 10,377 మంది ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు పండ్లతోటలతో స్థిరాస్తులను అభివృద్ధి చేసుకున్నారు.
- 2019–20లో పండ్ల మొక్కలు నాటుకున్న రైతులు ఇప్పటికే రెండేళ్ల పంట తీయడం విశేషం.

ఎకరాకు మూడేళ్లలో చెల్లించే సబ్సిడీ వివరాలు

పండ్ల రకం	ఎకరాకు నాటుకునే మొక్కలు	చెల్లించే మొత్తం (రూ॥ల్లో)
మామిడి	70	99,911
చీని	100	1,26,702
నిమ్మ	110	1,33,911
జామ	110	1,35,288
థైవాన్	444	2,25,560
సపోటా	60	86,504
కొబ్బరి	60	88,193
సీతాఫలం	240	1,90,114
దానిమ్మ	267	1,96,019
ఆపిల్‌రేగు	320	1,14,329
డ్రాగన్‌ఫ్రూట్	225 (పిల్లర్స్)	1,86,638
గులాబి	2000	1,90,000
మల్లె	1600	1,44,072
నేరేడు	40	61,793
చింత	40	60,999
మునగ	448	91,776
అంజూర	310	1,66,997

మరోసారి జగనన్నను సీఎం చేద్దాం

- శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



అల్లూరులో లబ్ధిదారులకు భూహక్కు పట్టాలు పంపిణీ చేస్తున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జనరంజక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో పేద ప్రజలకు భూహక్కు పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు.

దాచుకోవడం... దోచుకోవడమే టీడీపీ నినాదం...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దాచుకోవడం.. దోచుకోవడమే లక్ష్యంగా పార్టీ నాయకులు పాలన సాగించారే తప్ప ప్రజలకు చేసేందేమీ లేదని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి విమర్శించారు. పేదలు పెన్షన్లు, ఇంటి పట్టాలు కోసం టీడీపీ నాయకుల చూట్టూ తిరిగినా వచ్చేవి కావని గుర్తు చేశారు. ఆ పార్టీ నాయకులు రూ. వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. చంద్రబాబు చెప్పే మోసపు హామీలను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. అనంతరం గ్రామంలో 70 మంది లబ్ధిదారులకు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి భూహక్కు పట్టాలను అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మంజుల, మండల అధ్యక్షుడు రవియాదవ్, శాతనకోట సర్పంచ్ జనార్థన్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రవీంద్రనాయుడు, మాంగ్ర వేదవతమ్మ, షేక్‌రాహత్ జబ్బార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత జగనన్న లక్ష్యం

- నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నిధులు జమ
- జిల్లాలో 2,53,077 మహిళ లబ్ధిదారులకు రూ.167.41 కోట్లు
- జెడ్పీ చెర్మన్ ఎర్రబ్రోతుల పాపిరెడ్డి



వైఎస్సార్ ఆసరా చెక్కును విడుదల చేస్తున్న ఎర్రబోతుల, కలెక్టర్ మనజీర్ జిలానీ తదితరులు

నంద్యాల: మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత ఆర్థిక సాయాన్ని మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ అభివృద్ధి సలహాదారుడు హబీబుల్లా, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, రాష్ట్ర బెస్త సంక్షేమ సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, పొదుపు సంఘాల మహిళా సభ్యులు తదితరులు వీక్షించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలోని వైఎస్సార్ ఆసరా 4వ విడత పథకం కింద డీఆర్‌డీఏ, మెప్మా పరిధిలో 26,012 స్వయం సహాయక సంఘాలకు చెందిన 2,53,077 మహిళా లబ్ధిదారులకు రూ.167.41 కోట్లు జమ చేశామన్నారు. డీఆర్‌డీఏ పరిధిలో 21,017 సంఘాల్లోని 2,09,707 మంది మహిళా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.136.61 కోట్లు, మెప్మా పరిధిలో 5,006 సంఘాలకు చెందిన 43,490 మంది మహిళా లబ్ధిదారులఖాతాల్లో రూ.31.22 కోట్లు నేరుగా జమ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా మాట్లాడుతూ రాష్ట్ర మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రధాన లక్ష్యంతో మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా కలెక్టర్ తదితరుల చేతుల మీదుగా స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కును అందజేశారు.

సీఎంకు రుణపడి ఉన్నాం



మా ఝాన్సీ గ్రూపుకు ఇప్పటి వరకు రూ. 5.20 లక్షలు వైఎస్సార్ ఆసరా పథకం కింద అందింది. దీనివల్ల మా గ్రూపు సభ్యులం ఈ సొమ్మును ఉపయోగించుకుని చిరు వ్యాపారాలు చేసుకుంటున్నాం.సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– రామలక్ష్మి, కానాల గ్రామం, నంద్యాల

ఆసరా పథకం ఎంతో మేలు



వైఎస్సార్ ఆసరా పథకం మా గ్రూపుకు ఎంతో మేలు చేసింది. కాశినాయన పొదుపు గ్రూపుకు ఇప్పటివరకు రూ.3.28లక్షలు ప్రభుత్వం జమ చేసింది. ఎన్నికల ముందు రుణమాఫీ చేస్తానని చెప్పిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారు. – అరుణ, చాపిరేవుల గ్రామం


వారధి నిర్మించి.. చివరి చూపు కల్పించి



అంత్యక్రియలకు మృతదేహాన్ని తీసుకెళ్తున్న కాలనీ వాసులు (ఫైల్)

పాణ్యం:చచ్చినా సమస్యే.. శవాలు ఏడుస్తున్నాయి.. చివరి చూపు కరువాయే.. అంత్యక్రియలకు వెళ్లేదెలా?.. శ్మశానికి దారేదీ?.. సొంతవాళ్లకు మట్టి ఇవ్వలేని దుస్థితి.. ఇలాంటి శీర్షికలతో కౌలూరు దళితులు ఎదుర్కొంటున్న సమస్యపై దిన పత్రికల్లో ఎన్నోసార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఎన్నో ప్రభుత్వాలు మారాయి. ఎవరూ పట్టించుకోలేదు. పాణ్యం మండలం కౌలూరు దళిత కాలనీలో ఎవరైనా చనిపోతే శ్మశానానికి మృతదేహాన్ని తరలించాలంటే జుర్రాగు దాటాల్సిందే. ఈ వాగులో ఏటా తొమ్మిది నెలలు నీటి ప్రవాహం ఉంటుంది. పాణ్యం నుంచి మొదలయ్యే ఈ వాగుకు చుట్టు పక్కల పొలాల నుంచి ఎస్సార్బీసీ నీరు చేరడంతో నిత్యం ప్రవహిస్తూనే ఉంటుంది. వర్షాకాలంలో దాదాపు ఎనిమిది అడుగుల మేర నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అంత్యక్రియలకు శవాన్ని శ్మశానానికి చేర్చాలంటే వానాకాలంలో కుటుంబీకులు, బంధువులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగు దాటాల్సిందే. ఐదారుగురు వెళ్లి కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సి వచ్చేది. ఇంట్లో మహిళలు, చిన్నారులు సొంత మనిషికి మట్టి ఇవ్వలేని రోజులు ఉన్నాయి. గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు.

ఈత వచ్చిన వారే అంత్యక్రియలకు వెళ్లే వాళ్లం



కాలనీలో ఎవరైన చనిపోయారంటే కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మట్టి ఇవ్వలేని పరిస్థితి ఉండేది. ఈత వచ్చిన వాళ్ల ప్రాణాలు పనంగా పెట్టి అతికష్టం మీద మృతదేహాలను మోసుకోని శ్మశాన వాటికకు చేర్చేవాళ్లం. వర్షాకాలంలో వాగు ఉధృతి అధికంగా ఉంటుంది. సాహసం చేసి అంత్యక్రియలు పూర్తి చేయాల్సి వచ్చేది. ఎన్నో ఏళ్ల నరకాన్ని చూశాం. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వంతెన నిర్మించి సమస్యను పరిష్కరించారు.

– మన్నె మనోభా, కౌలురు



ఇదీ మార్పు

బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

వైఎస్సార్‌సీపీ పాలనలో బ్రిడ్జి వచ్చేసింది..

ఏదైనా కార్యక్రమం నిమిత్తం గ్రామానికి అధికారులొచ్చినా.. ప్రజా ప్రతినిధులు వచ్చినా దళిత కాలనీ ప్రజలతో పాటు వాగు అవతలి వైపు పొలాలు ఉన్న రైతులు వంతెన నిర్మించాలని కొన్నేళ్లుగా ఏకరువు పెట్టినా ఎవరూ సమస్య తీవ్రతను గుర్తించలేదు. 2019 ఎన్నికల ముందు ప్రచారంలో భాగంగా గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఇచ్చిన మాట మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. రూ. 25 లక్షల జీపీ నిధులతో జుర్రాగుపై వంతెనను నిర్మించి చివరి చూపునకు అవకాశాన్ని కల్పించారు. 2023 అక్టోబర్‌లో వంతెన ప్రారంభం కావడంతో దశాబ్దాల కాలం నాటి సమస్యకు చెక్ పడింది. వైఎస్సార్‌సీపీ పాలనలో తమ సమస్య పరిష్కారం కావడంతో కౌలూరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాడు - నేడు పనుల పరిశీలన



వివరాలు ఆరా తీస్తున్న సెంట్రల్ టీం సభ్యులు

కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పథకం కింద చేపట్టిన పనులను మంగళవారం విజయవాడకు చెందిన సెంట్రల్ క్వాలిటీ కంట్రోల్ టీం సభ్యులు బుగ్గయ్య, రాములు పరిశీలించారు. తిమ్మనాయినిపేట, అబ్దులాపురం ఉన్నత పాఠశాలలు, ఇటిక్యాల డిపెప్ ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన పనులను వారు తనిఖీ చేశారు. పనులు పూర్తి, నిధులు ఎంత మేర ఖర్చు చేశారనే వాటిపై రికార్డులు, బిల్లులు పరిశీలించారు. రికార్డుల నిర్వహణ గురించి పాఠశాల హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు ఇచ్చారు. పనుల్లో ఎక్కడైనా అక్రమాలు చోటు చేసుకుంటే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత కల్పించి నాడు–నేడు పథకం కింద అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. రికార్డులు, బిల్లుల్లో తేడాలు రాకుండా చూసుకోవాలన్నారు. వారి వెంట డీఈ బోజప్ప, ఎంఈఓ అబ్దుల్ కలాం ఉన్నారు.

క్లుప్తంగా

అహోబిలేశుడికి నీరాజనం



ఉత్సవ పల్లకీని మోస్తున్న బోయిలు

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉత్సవ మూర్తులు జ్వాల నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామి పల్లకీ యాదవాడ గ్రామంలో కొలువుదీరింది. గ్రామ పొలిమేర తెలుపుపై కొలువైన ఉత్సవ మూర్తులకు గ్రామ ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు భుజాలపై మోసుకుంటూ తెలుపులపై కొలువుంచారు. ప్రజలు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కర్ణాటక మద్యంపై ఉక్కు పాదం



నిందితులతో పాటు కర్ణాటక మద్యం చూపుతున్న రైల్వే పోలీసులు

ఆదోని సెంట్రల్: కర్ణాటక మద్యంపై రైల్వే పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆదోని మీదుగా రాకపోకలు సాగించే రైళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున రైల్వే ఎస్‌ఐ కె.గోపాల్ తన సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఆదోనికి చెందిన బోయ నరసింహులు, బోయ రవి ఎక్స్‌ప్రెస్ రైలు నంబర్.22159 నుంచి రెండు లగేజీ బ్యాగులతో దిగి వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. అందులో 6 బాక్స్‌ల కర్ణాటక మద్యం ఉన్నట్లు గుర్తించారు. దాదాపు రూ.27,950 విలువ ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఆదోని సెంట్రల్: స్థానిక ఇందిరానగర్ కాలనీకి చెందిన మాదిగ పెద్ద లక్ష్మన్న కుమారుడు రాముడు (50) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ గోపాల్ తెలిపిన వివరాలు.. ఆదోని-నగరూర్ రైల్వే లైన్ మధ్య గూడ్స్ కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించి, వివరాలు ఆరా తీశారు. కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేక అటు ఇటు తిరిగే వాడని కుటుంబ సభ్యులు చెప్పారు. కాగా రాముడికి భార్య రంగమ్మ, ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కర్నూలు : స్థానిక పాతబస్తీలోని పెద్దపడఖానాలో నివాసముంటున్న పుష్ప(26) ఆత్మహత్య చేసుకుంది. సోమవారం రాత్రి పడక గదిలో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు కనుగొని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమె భర్త మహేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరికి కొడుకు, కూతురు సంతానం. పదేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా తన కూతురు అనారోగ్యంతో బాధ పడుతుండేదని, బాధ తాళలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు పుష్ప తల్లి మరియమ్మ ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీలకంఠుడి జాతర చూసొద్దాం రండి

- 25 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- 27న నీలకంఠుడి మహా రథోత్సవం
- నెల రోజుల పాటు కొనసాగనున్న జాతర
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



నీలకంఠేశ్వరస్వామి ఆలయం, (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో శివలింగం

ఎమ్మిగనూరు: ఆంధ్ర – కర్ణాటక సరిహద్దు ప్రాంతాల ప్రజల ఇలవేల్పు నీలకంఠేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి. చుట్టుపక్కల నుంచి దాదాపు 80 గ్రామాల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే జాతరకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆడపడుచులకు కొత్త దుస్తులు పెట్టాలన్నా, గాజులు తొడగాలన్నా.. బంధుమిత్రులకు విందులు ఏర్పాటు చేయాలన్నా, పాడి పశువులు కొనాలన్నా, జోడెడ్లు బేరం చేయాలన్నా, వ్యవసాయ పనిముట్లు కొత్తవి చేయించుకోవాలన్నా.. ఇదే శుభ సమయమని ఇక్కడి ప్రజల భావన. జిల్లా నలుమూలల నుంచే గాక కర్ణాటకలోని బళ్లారి, రాయచూర్, మహారాష్ట్రలోని సోలాపూర్, తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.

వనపర్తి సంస్థానాధీశులు కూడా స్వామి వారి భక్తులే..

జిల్లాలోని ఎమ్మిగనూరు ఒకప్పుడు కుగ్రామం. చేయి తిరిగిన చేనేత కళాకారులకు చిరునామా. నీలకంఠేశ్వరుడి మీద భక్తితో నేత కార్మికులు కాశీ నుంచి లింగాన్ని తీసుకొచ్చి ప్రతిష్ఠించారని స్థానికులు చెబుతారు. అప్పటి నుంచే నీలకంఠేశ్వరస్వామిగా పూజలందుకుంటున్నారని ప్రతీతి. స్వామి లీలలు వెలుగులోకి రావడంతో భక్తుల రద్దీ పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి సంస్థానాధీశులకు ఎమ్మిగనూరు చేనేతలంటే మహా ఇష్టం. తరచూ ఇక్కడి వచ్చి చేనేత వస్త్రాలు తీసుకెళ్లేవారు. ఈక్రమంలో స్వామి ప్రత్యేకతను తెలుసుకుని భక్తులుగా మారారు. వీరి సహకారంతో శిల్పి వీరప్ప 30 అడుగుల ఎత్తుతో రథాన్ని సుమారు ఏడాది పాటు శ్రమించి తయారు చేసినట్లు తెలుస్తోంది. పురాణ గాథలకు సంబంధించిన బొమ్మలతో మహారథం గంభీరంగా దర్శనమిస్తోంది.

ఎనుమలూరే.. ఎమ్మిగనూరు

నీలకంఠేశ్వర స్వామి ఆలయం వెలసిన ప్రాంతాన్ని గతంలో ఎనుమలూరుగా పిలిచేవారు. పూర్వం ఈ ఊరి సంతలో ఎనుమల (గేదెలు) క్రయవిక్రయాలు భారీగా జరిగేవి. కర్నూలు, వనపర్తి, గద్వాల, కంప్లీ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికొచ్చేవారు. అలా ఎనుమలూరు పేరు స్థిరపడిపోయిందంటారు. కాగా హెమ్మె అంటే కన్నడంలో గర్వం అని అర్థం. విజయనగర గజపతులను ఓడించిన కృష్ణదేవరాయలు జైత్రయాత్రను కొనసాగిస్తూ ఎమ్మిగనూరు సమీపంలో కొంతకాలం విడిది చేసినట్లు తెలుస్తోంది. ఆ సమయంలోనే తనలోని అహాన్ని తొలగించమంటూ పరమ శివుడిని ఉద్దేశించి ఇక్కడ యాగం నిర్వహించాడని చెబుతారు. స్థల మహత్యం వల్ల కావచ్చు.. రాయలలోని గర్వం నశించి పోయింది. రాయలవారి అహాన్ని కరిగించిన ఊరు కాబట్టి హెమ్మిగనూరుగా, తదనంతరం ఎమ్మిగనూరుగా నిలువబడిందని చరిత్రకారుల అభిప్రాయం.



ముస్తాబవుతున్న మహారథం

ఉత్సవాలు ఇలా..

నీలకంఠేశ్వరస్వామి ఉత్సవాలు ఈనెల 25న ప్రారంభమై నెలరోజులపాటు కొనసాగుతాయి. శోభకృత్‌నామ సంవత్సరం పౌర్ణమిరోజు (25వ తేదీ) రాత్రి పార్వతి, పరమేశ్వరుల కల్యాణం ఉంటుంది. 26న రాత్రి ప్రభావళి మహోత్సవం, 27న మహారథోత్సవం, 28న రాత్రి 9 నుంచి మధ్యరాత్రి 12 గంటల వరకు వ్యాహావళి, 29న సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు తీర్థావళి వసంతోత్సవం ఉంటాయి.

నా అదృష్టం



మాకుటుంబ సభ్యులే నాలుగు తరాలుగా వేడుకలు నిర్వహిస్తున్నాం. 43 ఏళ్లుగా నీలకంఠేశ్వర ఆలయంలో పార్వతీపరమేశ్వరులకు కల్యాణం చేయించడం నా పూర్వజన్మ సుకృతం. స్వామి వారి కల్యాణం తరువాత ప్రభావళి మహోత్సవం, మహా రథోత్సవం, వ్యాహావళి రథోత్సవం, తీర్థావళీ మహోత్సవం తదితర కార్యక్రమాలు చేయడం నిజంగా నా అదృష్టమే.

– సత్యనారాయణ స్వామి, వేదపండితులు

జాతరలో ప్రత్యేకతలు

మహారథోత్సవం ముగిసిన అనంతరం తేరుబజారు ప్రాంతం షాపింగ్‌మాల్‌గా మారిపోతుంది. మట్టి గాజుల నుంచి గృహోపకరణాల దాకా జాతరలో దొరకని వస్తువంటూ ఉండదు. నవదంపతుల కొత్త కాపురానికి అవసరమైన సామగ్రిని జాతరలోనే కొనుక్కోవడం ఓ ఆచారం. ఒంగోలు గిత్తలు, దేశవాళీ పశువులు అమ్మకానికి వస్తాయి. బండ్లు, నాగళ్లు తదితర వ్యవసాయ సామగ్రి కూడా లభిస్తుంది. గయోపాఖ్యానం, కురుక్షేత్రం తదితర పౌరాణిక నాటకాల ప్రదర్శన ఉంటుంది. రాష్ట్ర స్థాయి ఎద్దుల బలప్రదర్శనలు ఉంటాయి. భోజన ప్రియులకైతే కడ్డీలతో కాల్చిన మాంసం నోరూరిస్తుంటుంది.

రవాణా శాఖ అధికారి జైలుపాలు

- సహకరించిన మరో ఏడుగురికి కూడా రిమాండ్

కర్నూలు: కర్నూలు డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో మోటార్ వాహన తనిఖీ అధికారి (ఎంవీఐ)గా పనిచేస్తున్న జూకూరు సునీల్‌కుమార్ జైలుపాలయ్యాడు. జిల్లా సరిహద్దులోని ఆర్‌టీఏ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తూ వాహనదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతూ సోమవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో చెక్‌పోస్టులో తనిఖీ చేయగా ఎంవీఐ సునీల్‌కుమార్ వద్ద రూ.2.02 లక్షల అనధికార సొమ్ము పట్టుబడింది. ఎంవీఐ సునీల్‌కుమార్‌తో పాటు అక్రమ వసూళ్లకు సహకరించిన హోంగార్డు యూసుఫ్, ప్రైవేటు వ్యక్తులు కర్నూలు షరీన్‌నగర్‌కు చెందిన పసుల మనోజ్‌కుమార్, పంచలింగాల గ్రామానికి చెందిన ఈడిగ రామచంద్ర గౌడ్, ధర్మపేటకు చెందిన పుట్టా అనిల్, కర్నూలు కొత్తపేటకు చెందిన చిలకల మధు, చిన్న మార్కెట్‌కు చెందిన వి.రవికాంత్, నంద్యాల జిల్లా మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఆవుల భాస్కర్ తదితరులను అదుపులోకి తీసుకుని విచారించి 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు. వీరందరినీ కర్నూలు బీక్యాంప్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి రుణ సదుపాయం



2024 డైరీని విడుదల చేస్తున్న చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి రుణ సదుపాయం కల్పిస్తోందని చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి తెలిపారు. మంగళవారం ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులోని తన చాంబర్‌లో 2024 డైరీలను విడుదల చేశారు. బ్యాంకు అమలు చేస్తున్న రుణ పథకాలు, డిపాజిట్లపై ఇచ్చే వడ్డీరేట్లు ఇతర అన్ని వివరాలతో డైరీని ముద్రించడం హర్షణీయమని ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అభిప్రాయపడ్డారు. డీసీసీబీ ద్వారా కొత్తగా ఎడ్యుకేషన్, హౌసింగ్ రుణాల పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. డిపాజిట్‌లపై ఏ బ్యాంకు ఇవ్వని విధంగా అధిక వడ్డీ రేటు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామంజనేయులు, ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్, డీసీసీబీ డీజీఎం నాగిరెడ్డి, ఏజీఎం త్రినాథ్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ రాఘువేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో బాలునికి అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ అనంతరం కోలుకున్న బాలుడు సాయితో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ బాలునికి పెద్దాస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేసి తిరిగి ఆయువు పోశారు. వివరాలను మంగళవారం జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ నాయక్ వివరించారు. అనంతపురం జిల్లా రేకులకుంటకు చెందిన సాయి(15) మూడేళ్లుగా కడుపు ఉబ్బరం, ఎదుగుదల లోపంతో బాధపడుతున్నాడు. అనంతపురం వైద్యుల సూచనతో ఈనెల 2న కర్నూలు పెద్దాస్పత్రికి వచ్చాడు. జనరల్ సర్జరీ యూనిట్ -2లో అడ్మిట్ అయ్యాడు. వైద్యులు అతనికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఎక్స్‌ట్రా హెపాటిక్ పోర్టల్ వీనస్ హైపర్ టెన్షన్ విత్ మాస్యూ స్పీనో మెగాలిగా గుర్తించారు. దీనివల్ల అతనిలో హిమోగ్లోబిన్ 6 గ్రాములకు పడిపోవడమే గాక రక్తకణాలు(ప్లేట్‌లెట్స్) 30వేలకు తగ్గిపోయాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతనికి స్ప్లెనెక్టమి విత్ స్ప్లెనో రీనల్ స్టెంట్ అనే సర్జరీ నిర్వహించారు. ఆపరేషన్ తర్వాత హిమోగ్లోబిన్ 10 గ్రాములకు, ప్లేట్‌లెట్స్ సాధారణ స్థాయికి చేరుకోవడంతో బాలుడు కోలుకున్నాడు. ఇలాంటి అరుదైన ఆపరేషన్ ప్రైవేటు ఆసుపత్రుల్లో నిర్వహిస్తే రూ.5లక్షల నుంచి రూ.6 లక్షల దాకా ఖర్చు అవుతుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా నిర్వహించినట్లు డాక్టర్ రామకృష్ణనాయక్ తెలిపారు.

ఆరోగ్యశ్రీని మరింత పక్కాగా అమలు చేయాలి

- వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్): పెద్దాసుపత్రిలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీని మరింత పక్కాగా అమలు చేయాలని ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు విభాగాల్లో ఆరోగ్యశ్రీ ప్రీ ఆథరైజేషన్ రిజిస్ట్రేషన్, క్లెయిమ్ పెయిడ్ కేసెస్ రిజెక్ట్ గాకుండా చూసుకోవాలని, ప్రతి ఒక్క కేసునూ పర్యవేక్షించాలని హెచ్‌ఓడీలకు ఆదేశించారు. ఈ-హాస్పిటల్ అమలును పలు విభాగాల్లో మరింత విస్తృతంగా అమలు పరచాలన్నారు. ఆసుపత్రిలో అత్యవసర పరికరాలు కొనేందుకు కొనుగోలు కమిటీని నియమించినట్లు చెప్పారు. ఈ నెల 28వ తేదీన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, బర్న్స్ వార్డు, కేఎంసీ ఎగ్జామినేషన్ హాలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో వైద్యులందరూ పాల్గొనాలని తెలిపారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో హాజరు రిజిస్టర్, సెలవులకు సంబంధించిన అటెండెన్స్ రిజిస్టర్, లీవ్ అడ్రస్ పుస్తకాలు సరిగ్గా నిర్వహించాలని చెప్పారు. ఆసుపత్రిలో జరగబోయే రిపబ్లిక్ డే వేడుకలకు వైద్యులు, సిబ్బంది తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, డాక్టర్ రామకృష్ణనాయక్, డాక్టర్ రాధారాణి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శివ బాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి

విధుల్లో చేరిన 'సెబ్' అధికారులు

- డీటీఎఫ్ సీఐగా నర్స నాయుడు
- కర్నూలు స్టేషన్‌కు రాజేంద్రప్రసాద్



డీటీఎఫ్ సీఐ నర్స నాయుడు

కర్నూలు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కర్నూలు జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐగా నియమితులైన నర్స నాయుడు మంగళవారం విధుల్లో చేరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇక్కడున్న రాజశేఖర్ గౌడ్‌ను హిందూపురం సెబ్ స్టేషన్‌కు బదిలీ చేసి అనంతపురం ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న నర్స నాయుడును కర్నూలుకు బదిలీ చేస్తూ ఆ శాఖ కమిషనర్ రవిప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం అంపాపురం గ్రామానికి చెందిన ఈయన 2007లో ఎక్సైజ్ శాఖలో ఎస్‌ఐ హోదాలో విధుల్లో చేరారు. 2012లో సీఐగా పదోన్నతి పొందారు. ఈయన సర్వీస్ మొత్తం అనంతపురం జిల్లాలోని కల్యాణదుర్గం, గుంతకల్లు, కంబదూరు, హిందూపురం, ధర్మవరం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో కొనసాగింది.

కర్నూలు సెబ్ సీఐగా రాజేంద్రప్రసాద్



కర్నూలు సెబ్ సీఐగా రాజేంద్రప్రసాద్ విధుల్లో చేరారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా నుంచి 22 మంది సీఐలు పొరుగు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఇందులో భాగంగా కర్నూలు సెబ్ సీఐగా ఉన్న సత్యనారాయణను తిరుమలకు బదిలీ చేసి అమరావతి కేంద్ర కార్యాలయంలో పనిచేస్తున్న కేఆర్ రాజేంద్రప్రసాద్‌ను కర్నూలుకు బదిలీ చేయగా ఆయన మంగళవారం విధుల్లో చేరారు. అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణానికి చెందిన ఈయన 2007లో ఎస్‌ఐ హోదాలో ఎక్సైజ్ శాఖలో చేరారు. 2012లో సీఐగా పదోన్నతి పొందారు. ఈయన సర్వీస్ మొత్తం అనంతపురం జిల్లా కంబదూరు, చెన్నెకొత్తపల్లి, మడకశిర, కదిరి ప్రాంతాల్లో విధులు నిర్వహించారు.

27 నుంచి అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న నీలకంఠేశ్వర స్వామి జాతర పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 27వ తేదీ నుంచి వైఎస్సార్ అంతర్రాష్ట్ర వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. టోర్నీకి సంబంధించి పోస్టర్లను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తన నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఆర్గనైజర్లు మాట్లాడుతూ.. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ఎమ్మెల్యే చెన్న కేశవరెడ్డి, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో విజేతలకు వరుసగా రూ.40,116, రూ.30,116, రూ.20,116, రూ.10,116 నగదు అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 96668 33933, 80740 58451 నంబర్లను సంప్రదించాలన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఐదుగురి అరెస్ట్

- మూడు బైక్‌లు, 1,536 మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం

ఆదోనిరూరల్: మండలంలో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని మోటార్ సైకిళ్లపై తరలిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఇస్వీ ఎస్‌ఐ కె.శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది నాగనాతనహళ్లి గ్రామం బయట హెబ్బటం రోడ్డు వంక వద్ద, ధణాపురం బస్టాండ్ వద్ద, మదిరె క్రాస్ వద్ద తనిఖీలు చేపట్టారన్నారు. బోయ చంద్రశేఖర్ (ఎల్లార్తి), గడిగే ఈరప్ప (హెబ్బటం), జి.కె.ఆదికేశవరెడ్డి (ములుగుందం), కె.సురేంద్ర (గార్లపెంట), ఎ.కాళింగ (పెద్దకడుబూరు) 1,536 మద్యం టెట్రా ప్యాకెట్లు (16 బాక్సులు) బైక్‌లపై తరలిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వారు ఉపయోగించిన మూడు బైక్‌లు, మద్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు.



స్వాధీనం చేసుకున్న మద్యం చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

చెంచుల గృహనిర్మాణాలకు సహకరించండి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో ప్రధాన మంత్రి గ్రామీణ్ హౌసింగ్ పథకంలో భాగంగా చెంచు గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి సహకారం అందించాలని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డా.బి.రవీంద్రారెడ్డి అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను కోరారు. మంగళవారం అనంతపురంలో ఆయనను కలిసి సహకారం కోరినట్లు పీఓ తెలిపారు. ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ.. ఒక్కో గృహానికి రూ.2,40,000 లను ఒక యూనిట్‌గా కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులతో ఐటీడీఏ పరిధిలోని గృహాలు లేని కుటుంబాలకు నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి జనజాతి, ఆదివాసి న్యాయ అభియాన్ కింద మొదటి విడుతగా ఒక్కో లబ్ధిదారునికి కేంద్రప్రభుత్వం రూ.లక్షను మంజూరు చేసిందన్నారు. దేశంలోని ఐదు రాష్ట్రాలలో ఉన్న ఈ గిరిజనులకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. 1,345 గృహాలను శ్రీశైలం ఐటీడీఏ తరఫున నిర్మించాల్సి ఉండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు గృహ నిర్మాణాలకు పూర్తిగా సరిపోయే అవకాశాలు లేవని చెంచు గిరిజనులు తమ దృష్టికి తీసుకురావడంతో మాంచో ఫెర్రర్‌ను కలిసి సహకారం కోరినట్లు వివరించారు. దీనిపై స్పందించిన ఫెర్రర్ ప్రభుత్వాలు ఇచ్చే నిధులతో పాటు తమ సంస్థ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు పీఓ తెలిపారు.



ఆర్‌డీటీ డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌తో ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

నాపరాతి గనిలో కార్మికుడి మృతి



మృతి చెందిన కార్మికుడు పుల్లయ్య

కొలిమిగుండ్ల: బెలుం గుహల సమీపంలోని నాపరాతి గనిలో మంగళవారం చోటు చేసుకున్న ప్రమాదంలో ఓకార్మికుడు మృతి చెందాడు. ఎస్‌ఐ రమేష్‌రెడ్డి తెలిపిన మేరకు.. కొలిమిగుండ్లకు చెందిన మేడగట్టు పుల్లయ్య (30) జీవనోపాధి నిమిత్తం రోజు మాదిరిగానే నాపరాతి గనిలో కూలీ పనికి వెళ్లాడు. గనిలో నిలబెట్టిన నాపరాళ్ల పైనుంచి కిందకు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడటంతో మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిబంధనలకు నీళ్లు

- ఎస్‌సీఈఆర్‌టీ నిబంధనలను అమలు చేయని ప్రైవేట్ విద్యా సంస్థలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

కర్నూలు సిటీ: ప్రైవేట్ విద్యా సంస్థలు ఎస్‌సీఈఆర్టీ నిబంధనలను గాలికొదిలేస్తున్నాయి. సొంత ఎజెండాను రూపొందించుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. తరచూ తనిఖీలు చేసి గాడిన పెట్టాల్సిన అధికారులు మామూళ్ల రుచి మరిగి చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలది ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది.

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల కింద 1,472, ప్రైవేటు, కార్పొరేట్, సెమీ కార్పొరేట్ కింద 738 పాఠశాలలు ఉన్నాయి. ఈ స్కూళ్లలో ఏడాదికి పనిదినాల సంఖ్య, ఏఏ నెలలో ఏ సబ్జెక్టులో ఎన్ని పాఠ్యాంశాలు బోధించాలి, ఏ సబ్జెక్టుకు ఎన్ని పీరియడ్లు కేటాయించాలి, నెలల వారీగా పరీక్షలు నిర్వహించేందుకు టైమ్ టేబుల్ వార్షిక ప్రణాళికను తయారు చేసి ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేస్తుంది. రాష్ట్ర గుర్తింపు పొంది, అనుమతులతో నడుస్తున్న అన్ని యాజమాన్యాల స్కూళ్లలో ఈ ప్రణాళిక అమలు కావాల్సి ఉంది.

పరీక్షలు షెడ్యూల్‌నూ పక్కన పెట్టేస్తున్నాయ్..

కార్పొరేట్, ప్రైవేటు, సెమీ కార్పొరేట్ స్కూళ్లలోనూ ఎస్‌సీఈఆర్‌టీ క్యాలెండర్‌ను అమలు చేయడం లేదు. విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఎఫ్‌ఏ-3 పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. వచ్చే నెల మూడో వారంలో ఎఫ్‌ఏ-4 పరీక్షలు నిర్వహించి, ఏప్రిల్‌లో ఎస్‌ఏ-2 పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కానీ ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఎక్కడా అమలు చేయడం లేదు. ఎవరికి వారే ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేసుకుంటున్నాయి. ఆ ప్రణాళికల ప్రకారమే పాఠ్యపుస్తకాలతో బోధన చేస్తున్నారు. తమకు తోచిన విధంగా పరీక్షలను సైతం నిర్వహిస్తున్నారు. కొన్ని విద్యాసంస్థలు ఎఫ్‌ఏ-3 పరీక్షలు గతేడాది డిసెంబర్‌లోను, ఎస్‌ఏ-2 పరీక్షలను ఈ నెల 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించాయి.

మామూళ్ల మత్తులో అధికారులు..

వాస్తవానికి ప్రతి నెలలో ప్రైవేటు విద్యా సంస్థలను పాఠశాల విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయాలి. క్షేత్ర స్థాయిలో మండల విద్యాధికారులు(ఎంఈఓలు) తరచూ పాఠశాలలను తనిఖీ చేసి, ప్రణాళికలను అమలు చేయించాల్సి ఉంది. గతంలో అయితే అకడమిక్ పనులతో మండల స్థాయి అధికారులకు కొంత ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈఓలు ఉన్నారు. ఎంఈఓలు తనిఖీలు చేస్తున్నారా లేదా అని డిప్యూటీ ఈఓలు పర్యవేక్షణ చేయాలి. డిప్యూటీ ఈఓలకూ జిల్లా విద్యాశాఖ అధికారి దిశానిర్దేశం చేస్తూ ఉండాలి. కానీ ఏ స్థాయిలోనూ అలా జరగడం లేదు. ఆయా యాజమాన్యాల నుంచి అందుతున్న కాసులకు కక్కుర్తిపడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అమలు చేయకుంటే చర్యలు



ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రతి స్కూల్‌లో ఎస్‌సీఈఆర్‌టీ జారీ చేసిన అకడమిక్ క్యాలెండర్ అమలు చేయాల్సిందే. ఎక్కడైనా అమలు చేయకుంటే చర్యలు తీసుకుంటాం. క్యాలెండర్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలి. ప్రైవేటు స్కూళ్లలో వారు సొంతంగా ఏ పరీక్షలు పెట్టుకున్నా మాకు సంబంధం లేదు. కానీ పాఠశాల విద్య శాఖ క్యాలెండర్ ప్రకారం మేము ఇచ్చిన ప్రశ్నపత్రాలతో పరీక్షలు పెడుతున్నారా లేదా అనేది చూస్తాం. ఇప్పటి వరకు మా దృష్టికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. వస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ వి.రంగారెడ్డి, డీఈఓ